క్లుప్తంగా

ఏపీ రోలర్ స్కేటింగ్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా మురళీకృష్ణ



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఈ నెల 19న విశాఖపట్నంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఎన్నికల్లో కృష్ణాజిల్లా రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అదనపు ప్రధాన కార్యదర్శి బచ్చు మురళీకృష్ణ ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నిక కావడం చాలా ఆనందంగా ఉందని ఉమ్మడి కృష్ణాజిల్లా రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ డి.దుర్గాప్రసాద్ అన్నారు. సత్యనారాయణపురంలోని జీవీఎస్ శాస్త్రి పార్క్‌లో మురళీకృష్ణను ఆదివారం అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వరరావు, కోశాధికారి బీఎస్.తాతియతో పాటుగా స్కేటింగ్ కోచ్‌లు మురళీకృష్ణను అభినందించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా జె.సుధాకర్‌రెడ్డితో పాటుగా మొత్తం 9 మంది సభ్యులతో సంఘం నూతన రాష్ట్ర కమిటీని ఎన్నికైందని, 2027వ సంవత్సరంవరకు ఈ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం ఆదివారం జరిగింది. సుమారు 250 మంది వైద్య పరీక్షలు చేయించుకుని మందులు తీసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, డాక్టర్ కోనా వీరబ్రహ్మం, డాక్టర్ ఆదిత్య చంద్రభట్ల పాల్గొన్నారు.

మహాప్రస్థానం వాహనం బహూకరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మృతదేహాలను శ్మశాన వాటికకు తరలించేందుకు 'మానవత' స్వచ్ఛంద సేవాసంస్థ రూ. 8లక్షల విలువైన మహాప్రస్థానం వాహనాన్ని స్వర్గపురి కమిటీకి ఆదివారం బహూకరించింది. వాహనాన్ని మాజీ ఎంపీ, పారిశ్రామికవేత్త గోకరాజు గంగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద సామాన్య ప్రజలు మహాప్రస్థానం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే మానవత సంస్థ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ అధ్యాపకుడు వల్లభనేని భానుమూర్తి, స్వర్గపురి కమిటీ కార్యదర్శి తిపిరినేని పార్థసారథి, మానవత సంస్థ అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్, కార్యదర్శి సాంబశివరావు, కోశాధికారి పి.రాము తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు

విజయవాడకల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఏపీ సృజనాత్మక సమితి, శ్రీ శ్రీనివాసా నాట్యమండలి ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై ఆదివారం ప్రదర్శించిన సాంఘిక నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భారతజాతిలో స్ఫూర్తిని నింపిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ బాల్యం, విద్యాభ్యాసం, రాజ్యాంగ నిర్మాతగా ఎదగడం అంశాలుగా ద లీడర్ అంబేడ్కర్ నాటిక సాగింది. లాజర్ నాటకాల్లోని సన్నివేశాలను ప్రదర్శించారు. శ్రీ శ్రీనివాసా నాట్యమండలి వ్యవస్థాపకుడు వి.ధర్మదత్తు మాట్లాడుతూ ప్రభుత్వం కళాకారుల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం రెండో ఆదివారం, పౌర్ణమి నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కనిపించింది. తెల్లవారుజామున నుంచే ఉభయదాతల రాష్ట్రాలకు చెందిన భక్తులు నగరానికి చేరుకుని పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. మహామండపం లిఫ్ట్, మెట్లతో పాటు ఘాట్‌రోడ్డు మీదగా కొండపైకి చేరుకుని దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆది దంపతుల దర్శనం అనంతరం నటరాజ స్వామి వారి ఆలయం, రాజగోపురం ఎదుట ఉన్న అమ్మవారి ప్రతిమ వద్ద కార్తిక దీపాలను వెలిగించారు. ఉదయంనుంచి ప్రారంభమైన రద్దీ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. భక్తుల రద్దీతో క్యూలైన్లన్నీ కిటకిటలాడాయి. దేవస్థాన అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మరో వైపున అమ్మవారికి నిర్వహించిన పలు ఆర్జిత సేవలతోపాటు మల్లేశ్వర స్వామి వారికి నిర్వహించిన అర్చనలతో పాటు సహస్ర లింగార్చనలో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు.

తూర్పుకాపు అభివృద్ధి సంఘం నూతన కమిటీ ఎన్నిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీపీఐ కార్యాలయంలోని మారుతీ ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో తూర్పు కాపు విద్యా, విజ్ఞాన అభివృద్ధి సంఘం విజయవాడ నగర నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడుగా కోన శ్రీహరిసత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు యలకల చలపతిరావు, ప్రధాన కార్యదర్శి చింతా సింహాచలం, కోశాధికారి పిన్నింటి రామారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చీమల వెంకటరమణ ఎన్నికయ్యారు. వీరితోపాటు 24 మంది ఉపాధ్యక్షులు, 22 మంది గౌరవ సలహాదారులను నియమించారు. అనంతరం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. అధ్యక్షుడు శ్రీహరిసత్యనారాయణ మాట్లాడుతూ తూర్పు కాపుల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడతామని పేర్కొన్నారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణ విద్యాలయంలో 1977 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు నిర్వహించిన సమ్మేళనంలో ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఆటపాటలతో రోజంతా ఉత్సాహంగా గడిపారు. తమకు విద్యాబోధన చేసిన గురువులను సత్కరించారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 32వ డివిజన్ శాంతినగర్‌లో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు గుండే సుందర్‌పాల్, నాయకులు ఒగ్గు గవాస్కర్, పేరం త్రివేణిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో....

సత్యనారాయణపురం భగత్‌సింగ్ రోడ్డులోని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం ఆదివారం జరిగింది. ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన అంబేడ్కర్ సేవలను కొనియాడారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్ ప్రజల వద్దకు తీసుకొచ్చారని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ యాదల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ 61వ డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, నాయకులు రత్నకుమార్, సామంతపూడి చిన్నా, వరలక్ష్మి, ప్రసాద్, కోటి, సూరిబాబు, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి(డీపీఆర్వో) కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయ అధికారులు, సిబ్బందితో కలిసి డీపీఆర్వో యు.సురేంద్రనాథ్ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ పీఠికను చదివి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీపీఆర్వో ఎస్వీ.మోహన్‌రావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, పీఆర్వో వీవీ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది సత్యనారాయణ, భవానిమహేష్, శ్రీనివాస్, జ్యోతి, వహీద్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మల్లాది విష్ణు

ఠాగూర్ గ్రంథాలయంలో...

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవం ఆదివారం జరిగింది. గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి విద్యార్థులు, పాఠకులతో రాజ్యాంగ ప్రవేశికని ప్రతిజ్ఞ చేయించారు. గ్రంథాలయ సిబ్బంది ధనలక్ష్మి, రాంబాబు, శంకర్, ఫణిబాబు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద..

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతంరెడ్డి, వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ దుర్గ, సుందర్‌పాల్, గవాస్కర్‌లు తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్దగల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత ....

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు అన్నారు. లెనిన్ సెంటర్‌లోని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ ఐక్యతా భవన్‌లో రాజ్యాంగ దినోత్సవం ఆదివారం జరిగింది. తొలుత డీహెచ్‌పీఎస్ నాయకులు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, కొడాలి ఆనందరావు, కొండపల్లి కృష్ణ, శివకుమార్, కాళ్ల విజయ్, ప్రసాద్, రాము, ప్రకాశరావు, సీహెచ్ సైదులు పాల్గొన్నారు.

చిత్తరంజన్ గ్రంథాలయంలో...

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రంథాలయాధికారి సంపత్‌కుమార్ విద్యార్థులతో కలిసి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. రాజ్యాంగ దినోత్సవం గురించి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనరేట్‌లో....

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఓ ఏఓ టి.రంగారావు, సీపీ టీకే రాణా సందేశాన్ని వినిపించారు. రాజ్యాంగ పరిషత్ సభ్యులు రూపొందించిన రాజ్యాంగంను శాసనంగా ఆమోదించిన సందర్భంగా ప్రతి ఏడాది నవంబర్ 26న 'రాజ్యాంగ దినోత్సవం' జరుపుకొంటున్నామన్నారు. అనంతరం సిబ్బందితో ఆయన రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బంది, సీపీఓ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

61వ డివిజన్‌లో...

పాయకాపురం(విజయవాడరూరల్): 61వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో 61వ డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, కొమ్ము రామకృష్ణ, కీసర ఓంకార్‌రెడ్డి, డి.భరద్వాజ్, కిషోర్, బ్రహ్మారెడ్డి, దాసు, ఎం.కోటి, కె.ఫణికుమార్ తదతరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కార్యాలయంలో...

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రుహుల్లా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆ మహనీయుడిని స్మరించుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, షేక్ అమిత్, చింతా శ్రీను, షేక్ వెంకట్, గెల్లిపోగు రాజు పాల్గొన్నారు.

60వ డివిజన్‌లో...

స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలో సీపీఐ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. సీపీఐ నాయకులు కె.రామరాజు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ గౌతంరెడ్డి



61వ డివిజన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తోట శ్రీనివాస్



చిత్తరంజన్ గ్రంథాలయంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న గ్రంథాలయాధికారి సంపత్‌కుమార్

కూచిపూడి కళావైభవం పోస్టర్ ఆవిష్కరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): కూచిపూడి కళావైభవం పేరుతో భారత్ ఆర్ట్స్ అకాడమి, ఏబీసీ ఫౌండేషన్ సంయుక్తంగా డిసెంబర్ 24న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో గిన్నీస్ బుక్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు కోసం నిర్వహించనున్న మహా బృంద నాట్య కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె రోజా ఆవిష్కరించారు. ఆదివారం భవానీ ద్వీపంలో జరిగిన కార్తిక మాసోత్సవంలో పాల్గొన్న క్రమంలో మంత్రి రోజాతో భారత్ ఆర్ట్స్ అకాడమి అధ్యక్షురాలు లయన్ లలితరావు, ఏబీసీ ఫౌండేషన్ అధ్యక్షుడు లయన్ కేవీ రమణారావు ఈ పోస్టర్‌ను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా సంప్రదాయ కళలు, కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని మంత్రి రోజా తెలిపినట్లు లలితరావు, రమణారావు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్‌సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ సెక్షన్ దుర్గాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని ఐనాక్స్ ఫీడర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనులు నిమిత్తం సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కళాకారులు సాంస్కృతిక వారసులు

విజయవాడకల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారసులని కామ్రేడ్ జీఆర్‌కే –పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. జేఎంఎస్ నాట్యవేద ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో ఆదివారం సంగీత విద్వాంసుడు పాణ్యం దక్షిణామూర్తికి ఆత్మీయ గురు సత్కారం, కూచిపూడి నృత్యాలు, అన్నమయ్య సంకీర్తనా ప్రణవం నిర్వహించారు. జంగం విజయ్‌కుమార్, జంగం చక్రవర్తి డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తిని సత్కరించారు. జేఎంఎస్ యోగభారతి విద్యార్థులు సంప్రదాయ నృత్యాలను, అన్నమయ్య సంకీర్తనలను మధురంగా గానం చేశారు. జంగం మనీషా చక్రవర్తి, శిరీషా చక్రవర్తి నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న బాల బాలికలకు జ్ఞాపికలను అందజేశారు.

సంతాన సాఫల్య చికిత్సలపై అవగాహన సదస్సు

లబ్బీపేట(విజయవాడతూర్పు):వంధత్వంతో బాధ పడుతున్న జంటలకు ప్రయోజనం చేకూర్చేందుకు సహాయ పునరుత్పత్తి పద్ధతుల్లో నూతన ప్రక్రియలు, అధ్యయనాలపై ఆదివారం నగరంలో సదస్సు నిర్వహించారు. విజయవాడ అబ్‌స్టేట్రిక్స్ సొసైటీ, నోవా ఐవీఎస్ సెంటర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఈ సదస్సులో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ప్రసూతి వైద్యులు, సంతాన సాఫల్య కేంద్రాల వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంతాన సాఫల్య నిపుణురాలు డాక్టర్ వైస్వప్న మాట్లాడుతూ.. పెరుగుతున్న వంధత్వ సమస్యల గురించి మరింత అవగాహన అవసరమన్నారు. వైద్య నిపుణులను సంప్రదించేందుకు ఎప్పుడు సరైన సమయమో తెలుసుకోవాలన్నారు. సరైన సమయంలో వైద్యులను సంప్రదించడం ద్వారా ఫలితాలు పొందవచ్చునని ఆమె సూచించారు. గర్భిణులకు నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ గైనకాలజిస్టులు డాక్టర్ కోడే ప్రభాదేవి, డాక్టర్ శ్రీలక్ష్మి అట్లూరి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో కార్తిక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో దీపారాధనలు చేశారు.

ముత్యాలంపాడులో....

ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని లక్ష బిల్వార్చన, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిగాయి. ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో....

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, అన్నాభిషేకం జరిగాయి.

పసుపుతోటలో.....

పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో శివలింగం ఆకారంలో దీపాలను వెలిగించి పూజలు చేశారు. అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ జరిగింది.



దీపారాధనలు చేస్తున్న భక్తులు

జ్వాలాతోరణ దర్శనం...

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురంలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో జ్వాలాతోరణ మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే విష్ణు స్వామివారిని దర్శించుకుని జ్వాలా జ్యోతిని వెలిగించి ప్రదక్షణలు చేశారు. స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొల్లూరు రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): శివునికి ప్రీతికరమైన కార్తిక మాసంలో సత్యదేవుని సత్యనారాయణస్వామి వ్రతాలు చేయడం ఎంతో పుణ్యకార్యమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని ఆంధ్రరత్న పార్కులో నిర్వహించిన సామూహిక సత్యనారాయణ వ్రతాలలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సకాలంలో వర్షాలు పడి, పాడిపంటతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో జీవించేలా స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. నిర్వాహకులు ఎమ్మెల్యే మల్లాది విష్ణు, స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తులను సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ...

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఆలయ కమిటీ ఆధ్వర్యాన సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరిగాయి. సుమారు 125 మంది దంపతులు సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

వీఎంసీలో నేడు 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర వాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయాలన్నారు.

విజయవాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి విజయవాడ రూరల్ మండల తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తహశీల్దార్ కె.శ్రీలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో స్పందన కార్యాక్రమంలో అందజేయవచ్చన్నారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.బార్గవి తెలియచేశారు.

ఉచిత వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక ముత్యాలంపాడు అజయ్ హైస్కూల్‌లో పెద్దేశ్వర్ హార్ట్‌కేర్ సెంటర్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ప్రభుత్వ సేవలతో పాటు, ప్రైవేట్ హాస్పిటల్స్ ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయం అన్నారు. అనంతరం ప్రముఖ హార్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావు వైద్యబృందం, సిబ్బంది 300 మందికి ఉచితంగా గుండె స్కానింగ్(ఎకో), బీపీ షుగర్, ఈసీజీ పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఉచిత వైద్య శిబిరంలో ఎవరికైనా తదుపరి పరీక్షలు అవసరమైతే హాస్పిటల్ నందు ఉచితంగా చేస్తామని యజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, సాయి కృష్ణ, హైస్కూల్ ప్రిన్సిపాల్ అపర్ణ, డాక్టర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

డాక్టర్ 'ఇండ్ల' సేవలు అభినందనీయం

కడపరూరల్: దేశంలో ప్రముఖ మానసిక వైద్యుడిగా గుర్తింపు పొందిన డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మానసిక రోగులకు అందించిన సేవలకు గుర్తుగా వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు వరించడం ప్రశంసనీయమని వక్తలు కొనియాడారు. వైఎస్సార్ జిల్లా కడపలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో డాక్టర్ రామసుబ్బారెడ్డి అభినందన సభ ఆదివారం జరిగింది. డాక్టర్ సి.బాలిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథిగా హాజరైన ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా మాట్లాడుతూ.. వైఎస్సార్ జిల్లాకు చెందిన సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన డాక్టర్ రామసుబ్బారెడ్డి వైద్య రంగంలో రాణించడం జిల్లాకే గర్వకారణమన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, తాను బాల్య మిత్రులమని పేర్కొన్నారు. ఆయనకు పద్మశ్రీ పురస్కారం రావాలని ఆకాంక్షించారు. సన్మాన గ్రహీత డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. తన వైద్య సేవలకు గుర్తింపుగా వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకోవడం గర్వంగా ఉందన్నారు. అనంతరం రామసుబ్బారెడ్డి, రాధారెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు.



ఇండ్ల రామసుబ్బారెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



• వైభవంగా కార్తిక పౌర్ణమి



కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం భక్తులు వైభవంగా పూజలు నిర్వహించారు. పవిత్ర కృష్ణానదిలో స్నానాలు ఆచరించి పరమ శివుడిని దర్శించుకుని కార్తిక దీపాలు వెలిగించారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ రిలిజియస్ టూరిజం ఆధ్వర్యంలో భవానీ ద్వీపంలో శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం సౌజన్యంతో ఆది దంపతుల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





రైలు కింద తలపెట్టి వ్యక్తి ఆత్మహత్య

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలు కింద తలపెట్టి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై విజయవాడ ప్రభుత్వ రైల్వే పోలీసులు(జీఆర్పీ) కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో సింగ్‌నగర్ రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి కదులుతున్న రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. తల, మొండెం వేరు అయ్యి పట్టాల పక్కన పడి ఉండటంతో గుర్తించిన సిబ్బంది జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వయసు 45 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై తెలుపు రంగు చొక్కా, లుంగి ధరించి ఉన్నాడని, ఇతర ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు విజయవాడ జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో గాని, లేదా 94406 25744 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రైలు నుంచి జారిపడి మహిళ మృతి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): కదులుతున్న రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని మహిళ మృతిచెందిన ఘటనపై విజయవాడ ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్పీ) కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో సింగ్‌నగర్ రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని రైలు నుంచి మహిళ జారిపడి గాయాలతో పడి ఉంది. ఆమెను గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మహిళను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి వయసు 23 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై గులాబీ రంగు టాప్, తెలుపు రంగు లెగ్గిన్ ధరించి ఉందని, ఇతర ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు విజయవాడ జీఆర్పీ పోలీస్ స్టేషన్ లేదా 94406 25744 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడకల్చరల్: జేఎంఎస్ సరాగాలు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బందరురోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయని ఝాన్సీ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. వివిధ సంస్థల ప్రతినిధులు నారాయణరావు, డాక్టర్ ఆంజనేయరాజు పాల్గొన్నారు.